


కౌన్సిలర్ మృతి పట్ల చైర్మన్ సంతాపం

నిర్మల్ కల్చరల్, మార్చి 3 : మున్సిపల్ కౌన్సిలర్ సంపంగి రవీందర్ ఇటీవల మృతి చెందగా.. ఆదివారం చైర్మన్ ఈశ్వర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాంతినగర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి సంతాపం ప్రకటించారు. రవీందర్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ వెంట కౌన్సిలర్ గండ్రత్ రమణ తదితరులు ఉన్నారు.

కడెం పనుల్లో కదలిక



- కడెం గేట్ల మరమ్మతులకు పూర్తయిన టెండర్ ప్రక్రియ
- 4.09 శాతం ఎక్సెస్‌కు పనులను దక్కించుకున్న ఎస్‌పీపీఎల్ కంపెనీ
- యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయిస్తామంటున్న అధికారులు
- పనుల్లో ముందడుగు పడడం పట్ల రైతుల హర్షం



కడెం ప్రాజెక్టు (ఫైల్)



కడెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

(ఖానాపూర్, మార్చి 3)

గత రెండేళ్లుగా రాష్ట్రంలో దాదాపు అందరికీ సుపరిచితమైన పేరు కడెం ప్రాజెక్టు.. వరుసగా రెండేళ్ల వర్షాకాలంలో డేంజర్ బెల్స్ మోగించి అన్ని ప్రసార మాధ్యమాలలో పతాక శీర్షికన నిలిచిన కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం ఎట్టకేలకు ఓ కంపెనీ ముందుకు వచ్చింది. గత ఏడాది వర్షాకాలంలో వచ్చిన భారీ వరదలకు తీవ్రంగా దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు మరమ్మతుల పనులు నిర్వహించేందుకు గత ప్రభుత్వం జాప్యం చేయడంతో.. కడెం ఆయకట్టు రైతులు రెండు పంటలు నష్టపోవాల్సిన పరిస్థితి తలెత్తింది. మొదటిసారి వానాకాలం పంటను భారీ వరదలతో వదులుకున్న రైతన్నకు యాసంగి పంటను సైతం వదులుకోక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు పూర్తి కాకపోవడంతో ప్రాజెక్టులో నీరు నిల్వ లేకుండా పోయింది. ప్రస్తుతం కడెం ప్రాజెక్టు నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరింది. దీంతో యాసంగి పంటకు గత్యంతరం లేక క్రాప్ హాలీ డే ప్రకటించుకోవలసిన దుస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంపై ఈ ప్రాంత రైతులతో పాటు అప్పటి ప్రతిపక్షంలో ఉన్న ఇప్పటి పాలకపక్షం తీవ్రంగా మండిపడింది. ఈ తరుణంలోనే వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను కాదని ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. నియోజకవర్గంలో గెలిచిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కావడం.. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం కడెం ప్రాజెక్టుకు కలిసి వచ్చిందని చెబుతున్నారు. ప్రతిపక్షం ఉండి అప్పటి ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టిన కాంగ్రెస్ తాము అధికారంలోకి వచ్చాక కడెం ప్రాజెక్టును పట్టించుకోకపోతే తాము కూడా అవే విమర్శలను మూటగట్టుకోక తప్పదని భావించి కడెం మరమ్మతుల కోసం వెంటనే నిధులను మంజూరు చేసింది. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభించేందుకు సదరు కంపెనీతో అగ్రిమెంట్‌ను చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో మొత్తానికి భారీ వరదలకు దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చిందని జిల్లాలోని కడెం ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎట్టకేలకు పూర్తయిన టెండర్ ప్రక్రియ

గత రెండేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు వచ్చిన భారీ వరద నీటి తాకిడికి దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతుల కోసం ఎట్టకేలకు ఈ నెల 1వ తేదీన టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కడెం ప్రాజెక్టు మరమ్మతు పనులు నిర్వహించేందుకు సర్కారు కేటాయించిన నిధులపై 4.09 శాతం ఎక్సెస్ (అధికం)కు హైదరాబాద్‌కు చెందిన స్వప్న ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ టెండర్లను దక్కించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. భారీ వరదలకు దెబ్బతిన్న కడెం ప్రాజెక్టును నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జనవరి 10వ తేదీన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌లు పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద చేపట్టాల్సిన తాత్కాలిక మరమ్మతు పనులు, ప్రస్తుత ప్రాజెక్టు స్థితిగతులపై ప్రభుత్వానికి వెంటనే నివేదిక అందజేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. సీతక్క ఆదేశాల మేరకు స్టేఫ్టీ రివ్యూ ప్యానల్ సెంటర్ బృందం సూచనల ప్రకారం ప్రాజెక్టు వద్ద 18 గేట్లకు నిర్వహించాల్సిన మరమ్మతు పనుల కోసం రూ. 5.5 కోట్ల నిధులు అవసరం ఉందని ప్రభుత్వానికి ప్రాజెక్టు అధికారులు అంచనాలు సిద్ధం చేసి పంపించారు. దీంతో జనవరి 29వ తేదీన ప్రభుత్వం నుంచి కడెం ప్రాజెక్టు వద్ద చేపట్టాల్సిన మరమ్మతు పనుల కోసం రూ. 5.46 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులిస్తూ జీవో నెంబర్ 6ను విడుదల చేసింది. దీంతో ఎస్టిమేట్ కాస్ట్ ప్రకారం రూ. 3.77తో పనులు నిర్వహించేందుకు సంబంధిత శాఖ ద్వారా ఫిబ్రవరి మాసంలో మొదటిసారి టెండర్లు పిలిచారు. మొదటిసారి టెండర్లు పిలిచినప్పుడు పనులు నిర్వహించేందుకు ఏ సంస్థ కూడా ముందుకు రాలేదు. ఆ ప్రక్రియ ఫిబ్రవరి 22వ తేదీతో ముగిసింది. దీంతో తిరిగి ఫిబ్రవరి 23వ తేదీన రెండోసారి టెండర్లను పిలిచారు. రెండోసారి టెండర్లు పిలిచినప్పుడు హైదరాబాద్‌కు చెందిన బెక్కం కంపెనీ, స్వప్న ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రెండు కంపెనీలు కడెం ప్రాజెక్టు మరమ్మతు పనులు తగ్గించుకునేందుకు టెండర్లు వేశాయి. కాగా ప్రభుత్వం కేటాయించిన నిధులపై 4.8 శాతం అదనంగా బెక్కం కంపెనీ బిడ్ దాఖలు చేయగా, హైదరాబాద్‌కు చెందిన స్వప్న ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రభుత్వం కేటాయించిన నిధులపై 4.09 శాతం అదనంగా బిడ్ దాఖలు చేసింది. దీంతో స్వప్న ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి కడెం ప్రాజెక్టు మరమ్మతు నిర్వహణ పనులు దక్కినట్లు అధికారులు ప్రకటించారు. టెండర్ ప్రక్రియ ముగియడంతో ఇక పనుల నిర్వహణపై సదరు కంపెనీతో అగ్రిమెంట్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు పత్రాలను సిద్ధం చేస్తున్నారు. వారం రోజుల్లో ఈ అగ్రిమెంట్ ప్రక్రియ కూడా పూర్తవుతుందని తెలిపారు.

ముంచుకొస్తున్న గడువు

కడెం ప్రాజెక్టు మరమ్మతు పనుల నిర్వహణ కోసం టెండర్లు దక్కించుకున్న స్వప్న ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి పనుల నిర్వహణ కత్తి మీద సామేననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాకాలం సమీపించేందుకు గడువు తక్కువగా ఉన్నందున ప్రాజెక్టు వద్ద మరమ్మతు పనుల నిర్వహణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన పరిస్థితులు తలెత్తాయి. మే నెలాఖరులోపు ప్రాజెక్టు వద్ద వరదలను తట్టుకునేందుకు ప్రాజెక్టు సేఫ్టీ తాలూకు పనులన్నీ పూర్తి చేస్తామని ఇదివరకే ఇరిగేషన్ ఈఎన్‌సీ జనరల్ ప్రకటించారు. దీంతో ప్రాజెక్టు మరమ్మతు పనులు దక్కించుకున్న కంపెనీ ఎట్టి పరిస్థితుల్లో మే నెల వరకు ప్రాజెక్టు వద్ద సేఫ్టీ పనులన్నీ పూర్తి చేయాల్సిన పరిస్థితి ఉంది. అంటే కేవలం మూడు నెలల గడువు మాత్రమే ఉండడంతో పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా పనులను వేగంగా పూర్తి చేయాల్సిన బాధ్యత సదరు కంపెనీ భుజాలపై ఉందని పలువురు చెబుతున్నారు. లక్ష్యం చేరడం నిర్లక్ష్యం చేస్తే గత రెండేళ్లలో చవిచూసిన అనుభవాలే పునరావృతం అవుతాయని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. టెండర్ ప్రక్రియ ముగిసినందు వల్ల వెంటనే పనులను ప్రారంభించి వర్షాకాలం ఆరంభమయ్యే కంటే ముందే లక్ష్యాన్ని సాధించాలని పలువురు కోరుతున్నారు.



మరమ్మతులపై రైతుల హర్షం

కడెం ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేపట్టే దిశగా మార్చి 1వ తేదీన కీలకమైన ముందడుగు పడటం పట్ల కడెం ప్రాంత రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఇదివరకే గత రెండు పంటలను నష్టపోయిన తమకు రానున్న వానాకాలం పంటకైనా ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కడెం ప్రాజెక్టు మరమ్మతులు పూర్తయితే ఆయకట్టు కింద అధికారికంగా 68 వేల ఎకరాలు అనధికారికంగా మరో 20 వేల ఎకరాల వ్యవసాయ భూముల్లో పంటలు సాగు అవుతాయని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. ప్రాజెక్టుకు పూర్వ వైభవం తెస్తే నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గం అటు మంచిర్యాల జిల్లాలోని లక్షెటిపేట నియోజకవర్గాలలో ఏడు మండలాల రైతులకు లబ్ధి చేకూరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులు ప్రారంభించి మరమ్మతులు పూర్తి చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

జూన్ మొదటి వారంలోపు పనులు పూర్తవుతాయి..

- భోజదాస్ (డీఈ, కడెం ప్రాజెక్టు)

కడెం ప్రాజెక్టు మరమ్మతు పనుల కోసం టెండర్ ముగిసింది. వారం రోజుల్లోపు పనుల అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తవుతుంది. వెంటనే పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు గేట్ల వద్ద చేపట్టాల్సిన రోలర్స్, రబ్బర్ సీల్స్, అలైన్మెంట్, రోప్స్ మార్పిడి లాంటి మరమ్మతు పనులను జూన్ మొదటి వారంలోపు పూర్తి చేసి వర్షాకాలం ఆరంభం కాకముందే ప్రాజెక్టును సిద్ధం చేస్తాం.



హోమంలో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

ముథోల్, మార్చి 3 : మండలంలోని చించాల గ్రామంలో ఆదివారం పెద్దమ్మతల్లి, పోతరాజు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పండితులు గణేష్ మహరాజ్ నేతృత్వంలో వేద మంత్రోచ్చారణలతో పెద్దమ్మతల్లి, పోతరాజు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పుణ్యవచనం, కలశ పూజ, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో 11 జంటలు హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గంగాధర్, నాయకులు నర్సాగౌడ్, మరిబా, లస్మన్న, నడిపి లస్మన్న, శివరాం, ఓరగంటి లక్ష్మీకాంత్, సాయిలు, ముత్తన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కందెల సుమన్

'బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసమే ధర్మ సమాజ్ పార్టీ'

నిర్మల్ అర్బన్, మార్చి 3 : 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసమే ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భవించిందని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కండెల సుమన్ అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యక్రమంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ... మార్చి 15 నుంచి ఏప్రిల్ 30 వరకు పూలే అంబేడ్కర్ కాన్షీరాముల జయంతుల సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తూ మహనీయేలను బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. డా. విశారదన్ మహారాజ్ నాయకత్వంలో నడుస్తున్న ఈ పార్టీ సబ్బండ కులాల అందరికీ రాజకీయ అధికారం కట్టబెడుతుందని జోస్యం చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజల్లో భారత రాజ్యాంగ ఓటు విలువలపై చైతన్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్, కల్లూర్ సుధాకర్, సొన్న భూమేష్, రాజు మహారాజ్, నైనావత్ శ్రీనివాస్ నాయక్, రాథోడ్ వసంత్, వినోద్, సుధాకర్ మహారాజ్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో రికార్డు స్థాయి మెజారిటీ అందివ్వాలి

- ముథోల్ బీజేపీ శ్రేణులకు మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావ్ చవాన్ పిలుపు



భైంసాలో పర్యటిస్తున్న మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్‌రావ్ చవాన్



బీజేపీ శ్రేణులతో మాట్లాడుతున్న అశోక్‌రావ్ చవాన్

భైంసా, మార్చి 3 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి రికార్డు స్థాయి మెజార్టీ అందించి గెలుపులో కీలక భాగస్వాములుగా నిలవాలని ముథోల్ బీజేపీ శ్రేణులకు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్‌రావ్ చవాన్ పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలో ఒక వివాహ వేడుకకు హజరైన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ క్యాంపు కార్యాలయంలో ముథోల్ నియోజక వర్గ బీజేపీ శ్రేణులతో సమావేశమై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో ముథోల్ అసెంబ్లీ ఫలితాల్లో సాధించిన మెజార్టీకి మూడింతల అధిక్యతను అందించే దిశగా పార్టీ శ్రేణులు పాటుపడాలని సూచించారు. ప్రస్తుతం ఎక్కడికి వెళ్లిన, ఏ నోట విన్న ప్రధాని మోదీ మూడోసారి ప్రధాని అవ్వడం ఖాయమనే మాటనే వినిపిస్తోందన్నారు. తీస్రీ బార్ మోడీ సర్కార్ పక్కా అని వెల్లడించారు.ఇందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన విశేష అభివృద్ధి, సాధించిన విజయాలు,చేపట్టిన సంస్కరణలు, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించి పార్టీ అభ్యర్థి విజయబేరి మోగించేందుకు మార్గం సుగమం చేయాలని వివరించారు. ఇదే క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలు, లోపాలను ప్రజలకు తెలియచెప్పాలన్నారు. మోదీని మూడో సారి ప్రధానిని చేయడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలన్నారు. సరిహద్దునే ఉన్న రెండు రాష్ట్రాల పరిధిలోని ఆదిలాబాద్, నాందేడ్ పార్లమెంట్ నియోజక వర్గాలలో బీజేపీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు సమన్వయంతో వ్యవహరిస్తూ సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ నియోజక వర్గ రాజకీయ పరిస్థితులను చవాన్‌కు వివరించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

లక్ష్మణచాంద, మార్చి 3 : రూ. 30 లక్షల ఈజీఎస్ నిధుల అంచనా వ్యయంతో ఎంపీపీ అడ్వాల పద్మ మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముత్యం రెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, నాయకులు చెవ్వ రాజేశ్వర్, శ్రీను, నగేష్, దశ గౌడ్, దొంతుల రామ్ రెడ్డి, శ్రీకాంత్, వడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

దిలావర్‌పూర్, మార్చి 3 : కాల్వ శివారులోని స్వర్ణ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను దిలావర్‌పూర్ మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సిహెచ్. సంతోష్ సీజ్ చేశారు. అనంతరం ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఇసుక అవసరం ఉన్నవారు తహసీల్దార్ అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఆర్ఐ హెచ్చరించారు.



కంకర వేశారు.. తారు మరిచారు!

- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు

కుభీర్ మార్చి 3 : గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగు పరచాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న గుత్తేదారు సంవత్సరం అవుతున్నా.. పనులు పూర్తి చేయడం లేదు. పనులు ప్రారంభించి కొంత మేర కంకర పోసి వదిలేశారు. దీంతో స్థానికులకు రవాణా కష్టాలు పెరిగి ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని గిరిజన ప్రాంతమైన రంజిని గ్రామం నుంచి జాంగామ్ గ్రామ శివారు వరకు 3.2కిలో మీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూపాయలు కోటి 80లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులు దక్కించుకున్న గుత్తేదారు 2023 మే నెలలో పనులు ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాల్సి ఉన్నా.. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుత్తేదారు పనులు చేయడం లేదు. దీంతో కంకర వేసిన రోడ్డుపై వెళ్లే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. తారు రోడ్డు నిర్మాణంతో సౌకర్యంగా మారుతుందని ఆశించిన జనాలకు మరిన్ని కష్టాలు తెచ్చి పెట్టింది. పనులు పూర్తి చేసేలా చొరవ చూపాలని అధికారులకు, పాలకులకు పలుమార్లు విన్నవించినా.. స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తారు రోడ్డు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదాల బారిన వాహనదారులు


భూషణ్ (రంజిని గ్రామ వాసి)

రోడ్డు పనులు చేపట్టిన గుత్తేదారు సుమారు ఆరు నెలల క్రితం కంకర వేసి వదిలేశాడు. దీంతో పాదాచారులు సైతం నడవడానికి వీలు లేకుండా పోయింది. నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో ఇప్పటి వరకు ద్విచక్రవాహనదారులు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుత్తేదారుతో పనులు పూర్తి చేయించాలి. లేకుంటే ముస్ముందు మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

త్వరలో పనులు చేపట్టేలా చర్యలు..

(ఐటీడీఏ ఏఈ ప్రదీప్)


రంజిని నుంచి జాంగామ్ శివారు వరకు నిలిచి పోయిన రోడ్డు పనులను త్వరలో చేపట్టేలా సంబంధిత గుత్తేదారులపై చర్యలు తీసుకుంటాం. పనులు సకాలంలోనే పూర్తి చేయాలని రెండు సార్లు నోటీసులను అందజేశాం. మరోమారు నోటీసు జారీ చేస్తాం. పనులు చేపట్టక పోతే టెండర్‌ను రద్దు చేసి మరో గుత్తేదారుతో సకాలంలో పనులు పూర్తి చేసి గ్రామస్తులకు సౌకర్యం కల్పిస్తాం.



ఇదీ రంజిని గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి







సుగుణక్కకు ఎంపీ టికెట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి, మార్చి3 : ఆదివాసీ బిడ్డ ఆత్రం సుగుణక్క అందించిన సేవలను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం గురించి ఎంపీ టికెట్ ఇవ్వాలని దళిత సంఘాల నాయకులు సావంత్ లహూదాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 25 సంవత్సరాల నుంచి సామాజిక సేవలో ఉంటూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందించిన సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఆత్రం సుగుణకి కేటాయించాలని కోరారు. ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గాయక్ వాడ్ రాందాస్, ఆచార్య దత్త, వాగ్మారే పుండలిక్, గాయక్ వాడ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బరంపూర్‌లో ఉచిత వైద్య శిబిరం




రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శంషుద్దీన్

తలమడుగు, మార్చి3: మండలంలో బరంపూర్ గ్రామంలో ఆదివారం రోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డాక్టర్ శంషుద్దీన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రతీ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎలాంటి చిన్న వ్యాధి ఉన్న ప్రజలు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రేణుక, టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కేదారేశ్వరెడ్డి, రమాకాంత్, రంజిత్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు














చుక్కల మందు వేస్తున్న మంత్రి సీతక్క


నిర్మల్ బస్టాండ్‌లో పోలియో చుక్కలు వేస్తున్న మహేశ్వర్‌రెడ్డి


భైంసా ఏరియా ఆసుపత్రిలో చుక్కల మందును వేస్తున్న ఎమ్మెల్యే


భాగ్యనగర్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- పల్స్‌పోలియోలో పలువురు వక్తల పిలుపు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమం
- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

నేరడిగొండ, మార్చి3: ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం బోథ్ మార్కెట్ కమిటీపాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్లే క్రమంలో నేరడిగొండ మండల కేంద్రంలో పల్స్ పోలియో కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కల మందువేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కల మందు వేయించినపుడే నిండునూరేళ్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్, బోథ్ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, రాష్ట్ర నాయకులు సైతుమల్లేష్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్‌చందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఏపీఓ ఆత్రం భాస్ర్, జ్ఞానసు, వకీల్ రూప్‌సింగ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. కాగా నేరడిగొండ ప్రెస్‌క్లబ్ తరఫున మంత్రి సీతక్కకు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించగా మంత్రి స్పందించి త్వరలోనే విలేకరులందరికి ఇంటిస్థలాలతోపాటు నిర్మాణానికి నిధులు మంజూరుకుకృషి చేస్తానని హామీ ఇచ్చారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ రాథోడ్‌నరేందర్, తదితరులున్నారు.

నిర్మల్‌కల్చరల్: ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన పల్స్ పోలియో కేంద్రంలో చిన్నపిల్లలకు పోలియో చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో రెండురోజులు కొనసాగే ఈ కార్యక్రమంలో పిల్లలకు తప్పనిసరిగా పోలియో మందు వేయించాలన్నారు. ఆయనతో పాటు వైద్య అధికారులు, పట్టణ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● చుక్కల మందుతో చక్కని జీవితం: ఈశ్వర్

పోలియో మందు వేయిస్తే పిల్లలకు చక్కని జీవితం లభిస్తుందని నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం ఆయన బస్టాండ్, భాగ్యనగర్‌కాలనీలో చిన్నారులకు పోలియోచుక్కల మందువేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్, ఉపవైద్యాధికారి రాజేందర్, డాక్టర్ మనీషా, నయనారెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● విధిగా పోలియో చుక్కలు వేయించాలి: అదనపు కలెక్టర్

ఐదేళ్లలోపు చిన్నారులకు వారి తల్లిదండ్రులు విధిగా పోలియోమందు వేయించాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ప్రజలను కోరారు. నిర్మల్ ప్ర యాణ ప్రాంగణంలో పిల్లలకు పోలియోచుక్కల మందువేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 13 ఏళ్లుగా దేశంలో ఒక్క పోలియో కేసు నమోదు కాలేదన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో, బస్టాండ్‌లు, ప్రధాన కూడళ్లలో 561 పోలియో కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు.

● పోలియోరహిత సమాజాన్ని నిర్మిద్దాం: ఎమ్మెల్యే రామారావ్‌పాటిల్

భైంసా: పోలియోరహిత సమాజాన్ని నెలకొల్పేందుకు అందరూ బాధ్య తాయుంగా వ్యవహరించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్, సూపరిండెంట్ డా.కాశీనాథ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.ఇద్రీస్ గౌరితో కలిసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లితండ్రులు చిన్నారులకు తప్పనిసరి గా పోలియోమందును వేయించాలన్నారు.


సిరికొండలో పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం

సారంగాపూర్: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో పల్స్ పోలియో కేంద్రాలను బస్టాండ్, సంఘాల భవనాలలో ఏర్పాటు చేశారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్‌పోలి యో చుక్కలను వేశారు. అలాగే అడెల్లి పోచమ్మ దేవాలయం వద్ద పల్స్‌పోలియో కేంద్రాన్ని ఏ ర్పాటు చేసి చిన్నారులకు మందు వేశారు.

ముథోల్: మండలంలో 7వేల మంది పిల్ల లకు పోలియోచుక్కలు వేసినట్లు మెడికల్ ఆఫీసర్ డా.జి. ఆకా ష్ తెలిపారు. ఉమ్మడి మండలంలో 39 పోలియోకేంద్రాలు, ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కుంటాల: మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం సాగింది. మండ లంలో 4403 చిన్నారులకు పోలియోచుక్కలు వేసేం దుకు అన్ని గ్రాపంచాయతీలతోపాటు బస్టాండ్ ప్రదేశా లలో పోలియే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో పల్స్ పోలియో చుక్కల మందు కార్యక్రమాన్ని ఎంపీపీ రాథోడ్‌సజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. మధురా కాలనీలో సామాజిక కార్యకర్త సంతోష్‌సింగ్, కుమారిలో పీఏసీఎస్ ఛైర్మన్ మందుల రమేష్, ఆయ ఆ గ్రామాలలో చుక్కల మందు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సద్దాం, హెచ్‌ఈఓ హరికుమార్‌గౌడ్, సూపర్‌వైజర్‌రాంనరేష్, ఏఎన్‌ఎం అమ్మిబాయి, అంగన్‌వాడీ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలో అన్ని గ్రామాల్లో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ సురేందర్ ఐదేళ్ల పిల్లలకు పోలియో చుక్కలువేశారు. అన్ని గ్రామాల్లో పాఠశా లలు జీపీ ఆవరణలో పోలియో కేంద్రం ఏర్పాటు చేశారు.

సిరికొండ: సిరికొండలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఎంపీడీవో బాల గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అనేక దేశాలు పోలియోతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, భారతదేశం పోలియో రహిత దేశంగా మార్చడానికి ప్రతిఒక్కరు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పర్విన్ లతీఫ్, మాజీ సర్పంచ్ ఒరగంటి పెంటన్న, రాజు, ఏఎన్‌ఎం సుశీల, ఆశా కార్యకర్త జ్యోతి, అంగన్వాడీ హెల్పర్ మౌనజ పాల్గొన్నారు.

ఇంద్రవేల్లి: మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని జడ్పీటీసీ పుష్పలతా ప్రారంభించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు విధిగా పోలియో మందు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి డాక్టర్‌శ్రీకాంత్, వైస్‌ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్ పాల్గొన్నారు.

తాంసి: ఆదివారం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమానికి మండలంలో స్పందన కరువైంది. ఆయా గ్రామాలలో చుక్కల మందు కార్యక్రమాన్ని జడ్పీటీసీరాజు ప్రారంభించారు. ముందుగా ప్రచారం లేక చాలామంది పిల్లలకు చుక్కల మందు వేయించలేకపోయారని గ్రామస్థులు పేర్కొన్నారు.


కుంటాలలో పోలియో చుక్కలు వేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో


బోథ్‌లో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యుడు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

ఇచ్చోడ, మార్చి3: ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామానికి చెందిన దాదాపు 100 మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిమద్‌ఖాన్, మండల కన్వీనర్ కల్లెం నారాయణరెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కండువ కప్పుకున్నారు. సిరిచెల్మ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ అజీమ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనూసూయ సీతక్క ఆధ్వర్యంలో బోథ్‌లో పార్టీలో చేరారు. అజీమ్ ఆధ్వర్యంలో 100 మంది పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు నచ్చి పార్టీలో చేరినట్లు సిరిచెల్మ గ్రామస్తులు పేర్కొన్నారు. పేదల రాజ్యం కాంగ్రెస్ రాజ్యం అంటూ నినాదించారు.


బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్న సిరిచెల్మ గ్రామస్థులు

వాలా ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

నిర్మల్ కల్చరల్, మార్చి3: వాకింగ్ అండ్ లాఫింగ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడు నాళం శ్రీనివాస్ పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. సభ్యులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

బజార్‌హత్నూర్, మార్చి3: మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన జుగ్నక్ కైలాష్ (26) మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై ధారాసింగ్ తెలిపారు. మద్యానికి బానిసైన జుగ్నక్ కైలాష్ నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చేవాడని, ఈ క్రమంలో యువకుడి తల్లి మందలించడంతో మనస్థాపం చెంది మద్యంమత్తులో ఊరి సమీపంలోని పంటపొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

హామీలకు కట్టుబడి ఉన్నాం

- బోథ్ డివిజన్ ఏర్పాటుకు కృషి: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు : ఖానాపూర్ ఎమ్మెల్యే

ఇచ్చోడ, మార్చి3: అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన హామీలన్నింటికీ కట్టుబడి ఉన్నామని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించినట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఇచ్చోడ మండలకేంద్రంలోని నిమ్మల రాజమ్మకు గృహజ్యోతి జీరో బిల్లును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గృహజ్యోతి పథకంతో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతాయన్నారు. మరికొన్ని రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, బోథ్ ఇన్‌చార్జి ఆడె గజేందర్, ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిమూద్‌ఖాన్, వైస్‌ఎంపీపీ కొడప జాలైజాకు, తదితరులున్నారు.

● బోథ్ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తా..

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివారం బోథ్‌కు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సోనాల మండలం ఏర్పాటుకు గెజిట్ విడుదల చేసిన అక్కడ కార్యాలయలు ఏర్పాటు చేయడం లేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

● మంత్రి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

నేరడిగొండ, ఇచ్చోడ, సిరికొండ మండలాల నుంచి మాజీ సర్పంచులు మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ నగేష్, రోల్ మామడ మాజీ సర్పంచ్ అక్కయాదవరావు, ఆరేపల్లి మాజీ సర్పంచ్ గంగప్రసాద్, యాపాలగూడ మాజీ సర్పంచ్ గంగారం తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● కష్టపడ్డ వారికే పదవులు: ఎమ్మెల్యే

కష్టపడ్డ వారికే పదవులు వస్తాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పేర్కొన్నారు. రైతుబంధు రాదని తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని, ఇప్పటికే నాలుగుఎకరాలు ఉన్న రైతులకు రైతుబంధు వేసినట్లు చెప్పారు. త్వరలోనే సీఎం పంటరుణాలు మాఫీ చేస్తారని అరులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని అన్నారు. పైరవీకారులకు ఎంపీ టికెట్లు రావని, ప్రజల్లో ఉండే వారికి తప్పకుండా వస్తుందని చెప్పారు.


మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి


ఇచ్చోడలో నిమ్మల రాజమ్మకు బిల్లును అందిస్తున్న మంత్రి సీతక్క

● గత పాలకులు తెలంగాణను దోచుకున్నారు..

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామంటూ గొప్పలు చెప్పుకుంటూ గత పాలకులు తెలంగాణను దోచుకుని ఆస్తులు పెంచుకున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ఆదివారం బోథ్ బోథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బొడ్డు గంగారెడ్డి పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తాము అధికారంలోకి రాగానే రూ.7లక్షల కోట్లు అప్పులు చేసి ఉంచారని, అందుకు 70వేల కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తోందని అన్నారు. ప్రజాసమస్య పరిష్కారానికి కృషి చేయలేదని గొర్రెల పథకం ధరణి పథకాలతో దోపిడీకి తెరలేపారని విమర్శించారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్, టీపీసీసీ కార్యదర్శి కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, మల్లెపూల నర్సయ్య, ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్‌ఛైర్మన్ కొమురం కోటేష్, నాయకులు లక్ష్మీరాజేశ్వర్, బజర్హత్నూర్ జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, డీసీసీ బ్యాంకు ఛైర్మన్ పాల్గొన్నారు.


నేడు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక

- మున్సిపల్ మాజీ ఛైర్మన్ దస్తగిరి వర్గానికి ఖరారు
- వైస్ ఛైర్మన్‌గా రాజేందర్
- కౌన్సిల్ సమావేశానికి ఏర్పాట్లు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 3: కాగజ్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం ఎన్నికల సోమవారం జరుగనుంది. ఈ ఎన్నిక ప్రక్రి య కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్ ఆధ్వర్యంలో కమిషనర్ అంజయ్య, సిబ్బంది పూర్తి ఏర్పా ట్లు చేశారు. ఉదయం 10.30 గంటల ఎన్నిక ప్రారంభించనున్నారు. గత నెల 26న మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్‌పై అవిశ్వాసం ప్రవేశ పెట్టి నెగ్గడంతో మార్చి 4న తేదీ ఖరారు అయిన విషయం తెల్సిందే. ఈ పదవి ఎవరికి దక్కుతుందోననే సస్పెన్స్ ఇంత వరకు కొనసాగింది. కాగజ్‌నగర్‌లోని మున్సిపాలిటీలో 30 వార్డులకు గానూ బీఆర్‌ఎస్ బలం ఎక్కువగా ఉండడంతో బీఆర్‌ఎస్ నాయకుడే ఛైర్మన్ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నా యి. గత మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్‌పై కౌన్సిలర్లు గత నెలలో పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో సద్దాం హుస్సేన్ తన పదవి కోల్పోయారు. 2019లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపల్ కౌన్సిల్‌లో మెజారిటీ స్థానాలు బీఆర్‌ఎస్ పార్టీ గెలుచుకోవడంతో ఛైర్మన్‌గా సద్దాం హుస్సేన్, వైస్ ఛైర్మన్‌గా రాచకొండ గిరీష్‌లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. 4 సంవత్సరాల అనంతరం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టారు. ఫిబ్రవరి 26న మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో అవిశ్వాసం నెగ్గగా, ఆర్డీవో ఎన్నికలపై కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజుకున్న వేడి గత అసెంబ్లీ ఎన్నికల్లో కౌన్సిలర్లకు మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్ పదవీ గండం ఏర్పడింది. అసంతృప్త కౌన్సిలందరికీ మాజీ మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి నాయకత్వం వహించారు. ప్రస్తుతం దస్తగిరి సమీప బంధువు 19 వార్డు కౌన్సిలర్ షాహీన్ సుల్తానా కౌన్సిలర్‌గా ఉన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన 19వ వార్డు కౌన్సిలర్ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే గతంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌గా ఉన్నటువంటి రాజేందర్ సైతం అవిశ్వాసం కోసం కృషి చేయడంతో ఇద్దరి పేర్లు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ రేసులో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. నూతనంగా ఎన్నికైన ఛైర్మన్ కేవలం పది నెలల పాటు అధికారంలో ఉండే అవకాశాలున్నాయి. నిధులు సకాలంలో వస్తాయా..? అభివృద్ధి పనులు జరుగక పోతే పరిస్థితి ఎంటీ..? అనే కో ణంలో ఛైర్మన్ బరిలోకి ఎవరు కూడా ముందుకు రావడం లేదు. దీంతో మాజీ మున్సిపల్ ఛైర్మన్ దస్తగిర్ వర్గానికి గ్రీన్ సిగ్నల్ లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు కౌన్సిలర్లు చెబుతు న్నారు. గత ఛైర్మన్ సద్దాం హుస్సేన్‌ను దింపే ప్రయత్నంలో మాజీ ఎమ్మెల్యే కోనప్ప వర్గం సభ్యులు కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే కోనప్ప వర్గం నుంచి మాజీ మున్సిపల్ ఛైర్మన్ దస్తగిర్ వర్గానికి ఇచ్చేందుకు ఒప్పందం జరిగింది. దీంతో ఎన్నిక లాంఛనమైంది.

ఏర్పాట్లు పూర్తి చేశాం: సురేష్, ఆర్డీవో

మున్సిపల్ ఛైర్మన్ ఎన్నుకునేందుకు సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. సోమవారం ఉదయం 10.30కి సమావేశం ఉంటుంది. ఇందుకు 30 వార్డుల కౌన్సిలర్లకు సమాచారం ఇచ్చాం. ఎన్నిక ప్రక్రియకు సంబంధించి విధివిధానాలు కమిషనర్ ద్వారా కౌన్సిలర్లకు తెలియజేశాం.





● జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక



ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధం!

» నేడు జిల్లాకు మోదీ రాక
» స్వాగతించనున్న ముఖ్యమంత్రి, గవర్నర్
» పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
» జిల్లా నుంచే పార్లమెంట్ ఎన్నికల శంఖారావం
» కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేసిన అధికారులు

ఆదిలాబాద్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జిల్లా పర్యటనకు సర్వం సిద్ధమైంది. 41ఏళ్ల తర్వాత ప్రధాని హోదాలో మోదీ జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 10.20 గంటలకు జిల్లాకు చేరుకుని మధ్యాహ్నం 12.15 నిమిషాలకు తిరిగి వెళ్లనున్నారు. సుమారు గంట 55 నిమిషాల్లోనే మోదీ జిల్లా పర్యటన ముగియనుంది. జిల్లా కేంద్రంలోని ఎరోడ్రమ్ హెలిప్యాడ్ ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 నియోజక వర్గాల నుంచి భారీ జన సమీకరణకు ఎంపీ, ఎమ్మెల్యేలు, బీజేపీ ముఖ్య నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. బహిరంగ సభకు లక్ష మందిని తరలించేందుకు టార్గెట్ పెట్టుకున్నారు. మోదీ పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, రహదారులను కాషాయ జెండాలతో నింపేశారు. అలాగే పార్లమెంట్ టికెట్‌ను ఆశిస్తున్న నేతలంతా పోటీగా బ్యానర్లు ఏర్పాటుచేశారు. ఎన్నికలకు ముందు ప్రధాని పర్యటనతో జిల్లాలో సర్వత్రా ఆసక్తిని రేపుతోంది.

● ముఖ్యమంత్రి స్వాగతం..

ప్రధాని నరేంద్రమోదీ జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వాగతం పలుకనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ఖరారైంది. అలాగే గవర్నర్ తమిళిసై కూడా ప్రధానికి స్వాగతం పలుకనున్నారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 9.30 గంటలకు జిల్లాకేంద్రానికి చేరుకుంటారు. ఆ తర్వాత ప్రధానమంత్రితో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. తిరిగి 11.05 గంటలకు ఆదిలాబాద్ నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరిగి వెళ్తారు.

● రూ.6,697 కోట్ల పనులకు శంకుస్థాపనలు

నరేంద్రమోదీ జిల్లా పర్యటన సందర్భంగా రూ6,697 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. జైనథ్ మండలం బోరజ్ నుంచి బేల మండలం మహారాష్ట్ర సరిహద్దు వరకు 32.970కి.మీల మేర నేషనల్ హైవే 353(బి) రోడ్డు విస్తరణ రూ.491కోట్లు, హైదరాబాద్- భూపాల పట్నం 163 జాతీయ రహదారి అభివృద్ధికి రూ.136కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే రూ.6వేల కోట్లతో చే పట్టిన రామగుండం ఎన్టీపీసీ రెండో థర్మల్ పవర్ యూనిట్, సుమారుగా రూ.70కోట్లతో చేపట్టిన అంబారి - ఆదిలాబాద్ - పింపాలకుట్టి రైల్వేలైన్ విద్యుద్దీకరణ పనులను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

● అభ్యర్థి ప్రకటన పై ఉత్కంఠ

ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి జిల్లా నుంచే శ్రీకారం చుట్టనున్నారు. కానీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ప్రకటనపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే అభ్యర్థుల తొలిజాబితాను విడుదల చేసిన సిట్టింగ్ ఎంపీ సోయంబాపురావ్‌కు అవకాశం దక్కలేదు. దీంతో ఆదివాసీ వర్గాల్లో కొంత అసంతృప్తి కన్పిస్తోంది. అయితే రెండో జాబితాలో తన పేరు కచ్చితంగా ఉంటుందని ఎంపీ సోయంబాపురావు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాబాద్ పార్లమెంట్‌స్థానానికి తీవ్రమైన పోటీ ఉండడంతో అధిష్ఠానం మరింత ఆలోచిస్తుందన్నారు. ఏదిఏమైనా తనకు అవకాశం రావడం ఖాయమన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తు కార్యచరణపై ఆలోచిస్తామన్నారు.

● 2వేల మందితో గట్టి బందోబస్తు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు జిల్లా పోలీసులు గట్టి భద్రత ఏర్పాట్లను చేశారు. సుమారుగా 2వేల మంది పోలీసుసిబ్బందిని ఏర్పాటుచేశారు. ఇందులో 7 ఎస్పీలు, ఏడుగురు అదనపు ఎస్పీలు, 13మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 100మంది ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు భద్రత విధుల్లో పాల్గొననున్నారు. అలాగే కేంద్ర బలగాలు, ఎస్పీజీ, ఇంటలిజెన్స్, సెక్యూరిటీల 10 సెక్టార్లుగా విభజించి బందోబస్తు నిర్వహిస్తున్నారు. సుమారుగా 15జిల్లాల నుంచి పోలీసుసిబ్బందిని జిల్లకు తరలించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌చౌక్, కొమురంభీంచౌక్, గాంధీపార్కు, ఎరోడ్రమ్ వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

ప్రధాని షెడ్యూల్ ఇలా..

ప్రధాని నరేంద్రమోదీ జిల్లా పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారైంది. సోమవారం ఉదయం 9.20 నిమిషాలకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలిక్యాప్టర్‌లో 10.20కి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎరోడ్రమ్‌కు వస్తారు. 10.30 గంటల నుంచి 11 వరకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. 11.05 గంటలకు బయల్దేరి 11.15 నిమిషాలకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. 12 గంటల వరకు బహిరంగ సభను ముగించుకుని 12.05 గంటలకు బయలుదేరి 12.15 నిమిషాలకు హెలిక్యాప్టర్‌లో మహారాష్ట్రలోని నాందెడ్ జిల్లాకు వెళ్తారు.



ప్రధాని పర్యటన ఏర్పాట్ల పై చర్చిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు



బందోబస్తులో ప్రత్యేక పోలీసు బలగాలు



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాటుచేసిన వేదిక



● కాషాయ జెండాలతో నిండి పోయిన ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారులు

సంక్షిప్త సమాచారం

అభివృద్ధి పనులకు ఆదిలాబాద్ వేదిక: ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, మార్చి3: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆదిలాబాద్ వేదికగా వర్చువల్ మాధ్యమాల్లో శంకుస్థాపనలు చేయడానికి ప్రధాని నరేంద్రమోదీ సోమవారం ఉదయం 10 గంటలకు వస్తున్నారని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్మల్ ఎమ్మెల్యే శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో, జిల్లా నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రాన్ని నిండా ముంచారని అన్నారు. ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్పి సాగనంపారని అన్నారు. దాదాపు 9వేల కోట్ల అభివృద్ధి పనులకు ఆదిలాబాద్ వేదిక శంకుస్థాపనలు చేయడానికి నరేంద్రమోదీ వస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సిరికొండలో జీరో విద్యుత్ బిల్లుల అందజేత

సిరికొండ, మార్చి3: గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌కు సంబంధించిన జీరో విద్యుత్ బిల్లులను ఆదివారం సిరికొండలో వినియోగదారులకు విద్యుత్‌శాఖ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఇమామ్, బగ్నూరే మాధవ్ పటేల్, సదానందం, షేక్ ఇమామ్, సాజిద్, మండల విద్యుత్ లైన్ వర్క్ ఇన్స్పెక్టర్ మల్లేష్, మహేష్ పాల్గొన్నారు.

రేపు ఆదివాసీ విజ్ఞాన సదస్సు

ఉట్నూర్, మార్చి3: మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణం పీఎంఆర్సీ భవనంలో బొలిచేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆదివాసీ సదస్సు విజయవంతం చేయాలని బోలి చేతో ఫౌండేషన్ సీఈవో సాయికిరణ్, ఆత్రం మోతిరాం, కిరణ్‌లు కోరారు. గోండి, కోలామి, ఆదివాసీ భాష, సంస్కృతులను అంతర్జాతీ మాధ్యమాల ద్వారా భద్రపరుస్తూ గోండి, కోలామి, బాషాల్లో వీకిపీడియాలు నిర్మిస్తూ కళాశాల స్థాయిలో శిక్షణ తరగతులు ఏర్పాపు చేస్తూ యువతలో భాష రచన సామర్థ్యాలను వెలికి తీయడం కోసం ఈ సదస్సు దోహద పడుతుందని అన్నారు. భాషావేత్తలు, కవులు, కళాకారులు, ప్రజలు, యువకులు పెద్ద ఎత్తుతన హాజరై తెలంగాణ ఆదివాసీ విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

రేపు మండల సాధారణ సర్వసభ్య సమావేశం

సిరికొండ, మార్చి 3: రేపు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సిరికొండ ఎంపీడీవో బాల గంగాధర్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు. తమ శాఖలకు సంబంధించిన నిదికలతో రావాలని సూచించారు.

'మోదీ సభకు భారీగా తరలిరావాలి'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తాంసి, మార్చి 3: జిల్లా కేంద్రంలో నిర్వహించే మోదీ బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలిరావచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం కోరారు. ఆదివారం సాయంత్రం తాంసి మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల నుంచి జిల్లా కేంద్రానికి ఏ ప్రధానమంత్రి రాలేదని కానీ నరేంద్ర మోది మాత్రం మొట్టమొదటిసారిగా జిల్లా కేంద్రానికి వస్తున్నారన్నారు. అన్ని గ్రామాల అభివృద్ధి కోసం సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రతీఒక్కరు స్వాగతించాలని కోరారు. రాష్ట్రంలోనూ, అటు దేశంలోనూ నరేంద్ర మోదీని గద్దదించే కుట్ర జరుగుతోందని, కానీ అది ఎన్నటికీ సాధ్యం కాదనే విషయాన్ని ప్రతిపక్షాలు గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బ్రహ్మానందం, ఉపాధ్యక్షులు సామ సంతోష్ రెడ్డి, నాయకులు ప్రవీణ్, స్వామి, పోచ్చన్న, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతుపై అడవిపంది దాడి

● తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

ఉట్నూర్, మార్చి3: మండలంలోని కొలాంగూడకు చెందిన గిరిజన రైతుపై అడవి పంది దాడి చేసింది. తీవ్రంగా గాయపర్చడంతో గిరిజనుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కోలాంగూడకు చెందిన రైతు కొడప జంగు తన మొక్కజొన్న పంటకు ఆదివారం నీరు పెడుతుండగా అడవిపంది దాడి చేసిందని క్షతగాత్రుడు తెలిపాడు. ఛాతిపైన, కడుపు పైన దాడి చేయంతో రైతు అరవడంతో పక్క చేనులో ఉన్న రైతులు వచ్చి కాపడి జంగును హుటాహుటిన ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ బానోత్ మహేందర్ ప్రాథమిక చికిత్సలు నిర్వహించిన అనంతరం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ పంద్రజైవంత్‌రావు, ఆసుపత్రికి చేరుకుని రిమ్స్‌కు తరలించేలా కృషి చేశారు.



అడవిపంది దాడలో గాయపడిన రైతు జంగు

'పీఆర్సీని వెంటనే ప్రకటించాలి'



మాట్లాడుతున్న రాథోడ్ గణేష్

ఉట్నూర్ మార్చి3: ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీని వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్‌గనేష్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రావాల్సిన నాలుగు డీఏలు విడుదల చేయాలని పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు విడుదల చేయాలని, ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీలో ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని అన్నారు. జీవో3 స్థానంలో వేరే చట్టం చేసి ఏజెన్సీ నియమాలు ప్రమోషన్లు ఇవ్వాలని, టెట్‌తో సంబంధం లేకుండా సీనియర్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని, జీవో 317ను సవరించి స్థానికత ఆధారంగా బదిలీచేయాలని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సీఆర్టీల జీతాలు విడుదల చేయాలని అన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు ఆదాయపు పన్ను మిన హాయింపు విషయంలో 12లక్షల వరకు మినహాయింపు ఇచ్చి ఆర్థిక అసమానతను తగ్గించాలని ప్రధాని మోదీని కోరారు. న్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి గనేష్‌రాథోడ్, జిల్లా అధ్యక్షులు రవినాయక్, గోపాల్‌నాయక్, పవన్ నాయక్, గజేందర్, ఇందల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఐజీ

ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఐజీ

ఆదిలాబాద్ అర్బన్, మార్చి3: జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా మల్టీజోన్ ఐజీ ఏవీ రంగనాథ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బందోబస్తు సిబ్బందికి ఆయన పలు సూచనలు ఇస్తూ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఐజీ ఎరోడ్రంలోని హెలిప్యాడ్ ప్రదేశాలు, సభాస్థలి, అభివృద్ధి కార్య క్రమాల స్థలాన్ని పరిశీలించి సిబ్బందికి సూ చనలు చేశారు. ఐజీ వెంట ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం, మహబూబాబాద్ ఎస్పీ సుద రికే రామ్నత్, అధికారులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

జిల్లా సమస్యలపై ప్రధాని స్పందించాలి

● మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 3: జిల్లా అభివృద్ధికి కేంద్రం పరిధిలోని సమస్యలపై ప్రధాని తక్షణమే స్పందించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న డిమాండ్‌చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆదివారం ఆయన బహిరంగ లేఖ విడుదల చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలపై లేఖలో మాజీ మంత్రి ప్రధానిని ప్రశ్నించారు. కేంద్రం పరిధిలోని సీసీఐ పునరుద్ధరణ, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్, విమానాశ్రయం, కాటన్ ఆధారిత పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ అంశాల పై కేంద్రం నుంచి స్పందన లేదని ఈ సందర్భంగా లేఖలో పేర్కొన్నారు. గతంలో అనేకసార్లు సీసీఐ పునరుద్ధరణ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసు కువచ్చినా ఫలితం లేదని, మాజీ కేంద్రహోంశాఖ సహాయమంత్రి సీసీఐను సందర్శించి త్వరలో నే ప్రారంభిస్తామని హామీఇచ్చినా ఆచరణ సాధ్యం కాలేదని చెప్పారు. ఇప్పటికైనా ఆదిలాబాద్ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే హామీలను నేరవేర్చాలని ఈ సందర్భంగా డిమాండ్‌చేశారు. సోమవారం జరుగనున్న బహిరంగసభలో జిల్లావాసులు ఏళ్లుగా ఎదురు చూస్తున్న డిమాండ్లపై స్పందించి వాటికి సంబంధించిన నిధులు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు విజ్జగిరి నారాయణ, దాసరి రమేష్, యోగేశ్, సతీస్ తదితరులు పాల్గొన్నారు.

● 'బీజేపీవి ఓటు బ్యాంకు రాజకీయాలు'

బీజేపీవి ఓటు బ్యాంకు రాజకీయాలని మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఓట్లు అడగడానికి వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ ఆదిలాబాద్ అభివృద్ధి పట్ల దృష్టిసారించకుండా ఓటు బ్యాంకు రాజకీయాలకు తెరలేపుతున్నారని అన్నారు. అనాదిగా ఆదిలాబాద్‌లో మరుగున పడుతున్న అభివృద్ధి పనుల్లో సీసీఐ పరిశ్రమ, యువత ఉద్యోగాలు, టెక్స్‌టైల్ పరిశ్రమ, గిరిజన సెంట్రల్ యూనివర్సిటీ, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్‌తో పాటు విమానాశ్రయం పనులపై మోదీ దృష్టి సారించకుండా ఎన్నికల సమయంలోనే ఆదిలాబాద్ పర్యటనలు వస్తూ హామీలు నేరవేర్చకుండా వెళ్లడం ప్రజలకు తీవ్ర నిరాశకు గురి చేస్తున్నారన్నారు. దీన్ని నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించారు. బైక్‌ర్యాలీ నిర్వహించి నల్ల జెండాలతో నిరసన వ్యక్తంచేస్తూ ప్రధాన వీధుల గుండా ర్యాలీని కొన సాగించారు. ప్రజలకు ఇచ్చిన హామీల ను నెరవేర్చాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

